క్లుప్తంగా

గ్రామదేవత ఆలయానికి రోడ్డు వేయరూ..


బత్తిలి గ్రామదేవత ఆలయానికి ఇబ్బందులు పడుతూ వెళ్తున్న భక్తులు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గం బురదమయంగా మారింది. ఆలయానికి భక్తులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి రహదారిలో ఎక్కడికక్కడ నీరు చేరి నడిచి వెళ్లేందుకు కూడా వీలు కావడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి ఆలయానికి వెళ్లే మార్గంలో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుధ్య పక్షోత్సవాలపై వీడియో కాన్ఫరెన్స్

వీరఘట్టం: ఈ నెలాఖరు వరకు జరగనున్న పారిశుధ్య పక్షోత్సవాలపై కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రజలను భాగసామ్యం చేసి పక్షోత్సవాలను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థుల బాగోగులపై దృష్టి సారించండి


ఎ.చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వడంతో పాటు వారి ఆరోగ్యంపైనా దృష్టిసారించాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. ఇదే విషయమై ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యా సంవత్సరం ఆరంభమై రెండు నెలలు కావస్తున్నా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచడం లేదని, ఫలితంగా విద్యార్థులు మృతి చెందడం జరుగుతోందన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో పదుల సంఖ్యలో జ్వరాల బారి నపడిన వారున్నారన్నారు.

యాంకర్‌గా హెచ్‌ఎంకు పిలుపు


పాలక దేవానంద్

గుమ్మలక్ష్మీపురం: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్) వచ్చే నెల 9వ తేదీన ఏలూరులో నిర్వహించనున్న సింగర్స్ ఫెస్ట్ వరల్డ్ రికార్డ్స్ ప్రోగ్రాం యాంకర్‌గా గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాలక దేవానంద్ (మండ జీపీ స్కూల్ హెచ్‌ఎం) వ్యవహరించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ నుంచి పిలుపు అందినట్టు ఆయన స్థానిక విలేకరులకు మంగళవారం తెలిపారు. సింగర్స్‌గా ఈ ఫెస్ట్‌లో పాల్గొనేవారు సెల్: 97048 27234, 99122 99647 నంబర్లను సంప్రదించి వివరాలు నమోదుచేసుకోవాలని సూచించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయి అవార్డులు ప్రదానం చేస్తారన్నారు.

జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కువైందని ఇది చాలా దారుణమైన పరిస్థితి అని సీపీఎం పార్వతీపురం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, సురేష్, కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకతికతను వినియోగించుకోవాలి

పాలకొండ: రైతులు సాంకేతికతను వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ రత్నకుమారి అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో మెలకువలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. తగినంత మోతాదులో ఎరువుల వినియోగం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రసాదు, ఏఈవో నీలిమ, రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి అధికం


డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న రైతు

- సాగులో డ్రమ్ సీడర్ వినియోగంతో అధిక ప్రయోజనం

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో వరి సాగులో డ్రమ్ సీడర్ వినియోగం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, రైతులు పేర్కొంటున్నారు. ఈ విధానంతో సమయం కలిసి రావటంతో పాటు వ్యవసాయ వేతనదారుల కొరత, అధిక పెట్టుబడులను అధిగమించవచ్చు. ఈ ఏడాది రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి సాయం అందకపోవటంతో అప్పులు చేసి సేద్యం చేపడుతున్నారు. ఈ క్రమంలో పెట్టుబడి వ్యయం తగ్గించే మార్గాలపై అన్నదాతలు దృష్టి పెడుతున్నారు. తొలి దశలో వాతావరణం అనుకూలించక వెదలు జల్ల లేని రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. తాజాగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పొలంబాట పడుతున్నారు. వెదలు చల్లిన రైతులు ప్రస్తుతం కలుపు నివారణా చర్యలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో వరి సేద్యం చేపట్టనున్న రైతులకు వర్షపు నీటి ఆధారంతో పాటు ప్రత్యామ్నాయ పద్ధతులతో నీటి వనరులను వడిసి పడుతున్నారు. బురద దమ్ములో డ్రమ్ సీడర్ వినియోగం ఎంతగానో ప్రయోజనకరమని భావిస్తున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయానికి ఎటువంటి చర్యలు చేపట్టని క్రమంలో వీలైనంతవరకూ మదుపులు తగ్గించుకునేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

డ్రమ్‌సీడర్ వాడకం ఇలా...

- వరి సేద్యానికి 15రోజులు ముందుగా దమ్ము చేపట్టి పొలం సిద్ధం చేయాలి. విత్తనాలు వేసేందుకు నాలుగు రోజుల ముందు మరోమారు దమ్ము చేపట్టి నీరు నిలువ లేకుండా చూడాలి. పొలాన్ని సమానంగా చదును చేసుకోవాలి.
- బురద పదునులో రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరంలో కాలువలు ఏర్పాటు చేయాలి. ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను 24 గంటలు నీటిలో నానబెట్టిన తరువాత మరో 24 గంటలు గోనె సంచిలో ఉంచాలి. ఎకరానికి విత్తన రకాన్ని బట్టి 12 నుంచి 16 కిలోల విత్తనాలు సిద్ధం చేసుకోవాలి.
- మొలకెత్తిన విత్తనాన్ని పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా డ్రమ్ సీడర్ పరికరంలో వేసి విత్తుకోవాలి. మొక్కలు మొదటి ఆకు పూర్తిగా పురి విప్పుకునే వరకు(7 నుంచి 10 రోజులు) ఆరారా తగిన మోతాదులో తడులు అందించాల్సి ఉంటుంది.

పెట్టుబడి తక్కువ



డ్రమ్ సీడర్ విధానంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. తక్కువ పెట్టుబడి, నీటితో పంట సేద్యానికి తోడ్పడుతుంది. చీడ, పీడల నుంచి చేలుకు రక్షణ కలుగుతుంది. కాలిబాటలు వలన రైతులకు బహుళ ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయంలో సమయం, వేతనదారుల వినియోగం ఘననీయంగా తగ్గుతాయి. గ్రామీణ వ్యవసాయ సహాయకుల ద్వారా డ్రమ్ సీడర్ వినియోగంపై ఇదివరకే అవగాహన కల్పించాం. – కె.రత్నకుమారి, వ్యవసాయ శాఖ ఏడీ, పాలకొండ

- ఈ విధానంలో కలుపు నివారణ కోసం విత్తిన 8 నుంచి 10 రోజుల్లో ఎకరానికి 25 కేజీల ఇసుక వంతున సిద్ధం చేసి అందులో బుటాక్లోర్, సేఫనర్స్ 1.25 మిల్లీ లీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 35 గ్రాములు కలిపి పొలమంతా పలుచటి పొరలా చల్లాల్సి ఉంటుంది.
- మొలకెత్తిన 20 నుంచి 25 రోజులకు కలుపు మొక్క నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల ఫెర్నాక్సోన్(డిసోడియం లవణం) వార్షిక గడ్డి కలుపు మొక్కల నివారణకు వాడుకోవాల్సి ఉంటుంది. లేదా ఎకరాకు 400 మిల్లీలీటర్లు సైథాలో పాప్‌బ్యూటైల్ మందును నీటిలో కలిపి కలుపు మొక్కలపై పిచికారీ చేయాలి.
- వ్యవసాయాధికారులు సిఫార్స్ చేసిన భాస్వరం, పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ములో వేసి కలియదున్నాలి. మిగిలిన ఎరువులు చివరి దశలో వేసుకుంటే మేలు. అలాగే అధికారుల సూచనల మేరకు నత్రజని మూడు సమ భాగాలుగా చేసి విత్తిన 15–35–60 రోజుల వ్యవధిలో బురద నీరు పూర్తిగా తీసివేసిన తరువాత వేయాల్సి ఉంటుంది.

అధిక ప్రయోజనం

డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయడం ద్వారా పైరు వరుస క్రమంలో ఎదుగుదలకు వస్తుంది. ఈ విధానం వలన సూర్యరశ్మి, దారాలమైన గాలి చేలుకు బాగా అందుతుంది. అలాగే చీడపీడలు బెడద తగ్గుతుంది. ముఖ్యంగా దోమపోటు బెడద అధిగమించవచ్చు. సస్యరక్షణకు అయ్యే ఖర్చు కూడా మిగులుతుంది. నారు వేసే పద్ధతితో పోల్చుకుంటే 10 రోజులు ముందుగానే పంట కోతకు వస్తుంది. పెట్టుబడి కూడా 15శాతం వరకు ఆదా అవుతుంది.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: నగర పంచాయతీలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం మూడో రోజు కార్మికులు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పాల్గొన్నారు.

'మధ్యవర్తిత్వం-దేశం కోసం'


కార్యక్రమంలో పాల్గొన్న కోర్టు సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో మధ్యవర్తిత్వం-దేశం కోసం అనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ సభ్యుడు గొటారి వెంకటరావు, పారాలీగల్ వలంటీర్ అంధవరపు కోటేశ్వరరావు, మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్‌లు.. సదరు కార్యక్రమం ద్వారా కక్షిదారులకు అందే న్యాయసేవలపై అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎన్నో కేసుల పరిష్కారం జరుగుతుందని, ప్రతి చిన్న కేసుకూ న్యాయస్థానం చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. చాలా సమస్యలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమవుతాయని, ఆ దిశగా అందరూ ఆలోచన చేయాలని తెలిపారు.

పాలకొండలో భారీ వర్షం


పాలకొండ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: గత పది రోజులుగా ఉక్కపోతతో, మండే ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలు మంగళవారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. లోతట్టు వీధుల్లో నీరు చేరింది. మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టడంతో వీధి కూడళ్ల వద్ద పేరుకుపోయిన చెత్త నీటి ప్రవాహంతో తిరిగి కాలువల్లోకి చేరింది. దీంతో డ్రైనేజీలు పూడికపోయి మురుగు రోడ్లపైకి చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు.

మరోవైపు పంట పొలాల్లో నారు పోసిన మెట్ట రైతులకు వర్షం అనుకూలించగా లోతట్టు నారు మడుల్లో నీరు చేరడంతో మొలక స్థితిలో ఉన్న మడుల్లో వరి విత్తనాలు నీటి ఉధృతికి కొట్టుకుపోయాయని రైతుల ఆవేదన చెందారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

జియ్యమ్మవలస రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీఎస్ పద్మావతి సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బీజేపురం, శిఖబడి, గెద్ద తిరువాడ సచివాలయాలు, హెల్త్ సబ్‌సెంటర్లను ఆమె మంగళవారం సందర్శించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, సికిల్‌సెల్ ఎనీమియా, మలేరియా, రక్తహీనత వంటి ప్రమాదకర వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్‌తో మాట్లాడుతూ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు చేయించడంతో పాటు వాటి సంఖ్యను పెంచాలన్నారు.

పంటల బీమా చేయించుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ ఆర్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శివ్వాం, గొట్టివలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీలోగా వరి పంటకు సంబంధించిన బీమా చేయించాలన్నారు. బీమా చేయించుకుంటే ఏదైనా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నష్టమొచ్చిన పంటకు లెక్కగట్టి నష్టపరిహారం తీసుకోవచ్చన్నారు. అలాగే పురుగు మందులు, ఎరువులను వ్యవసాయ సిబ్బంది సూచనల మేర వినియోగించాలన్నారు. పార్వతీపురం డివిజన్‌లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వరినారు మడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జ్యోత్స్న సూచించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే పంటలకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. ఎరువులను పంట పొలాల్లో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడే వేసుకోవాలన్నారు. ప్రస్తుతం మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో 194 మెట్రిక్ టన్నుల యూరియా, 133 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉందన్నారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా జ్ఞాన సరస్వతి అమ్మవారు


శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తున్న జ్ఞాన సరస్వతి అమ్మవారు

పాలకొండ రూరల్: స్థానిక నక్కలపేటలో కొలువుతీరిన జ్ఞాన సరస్వతి అమ్మవారు మంగళవారం భక్తులకు శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పత్రి శరత్‌కుమార్ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అందించిన పలు రకాల కూరగాయలతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గ్రామ దేవత సంబరాలు

భామిని: మండలంలోని సింగిడి గ్రామంలో గ్రామదేవత సంబరాలు మంగళవారం సందడిగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవత వద్దకు ఘటాలతో వెళ్లారు.

విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు


కొమరాడలోని ఎరువుల షాపులో పురుగుమందు కాలం చెల్లే తేదీని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొమరాడ: మండలంలోని జంఝావతి రబ్బర్ డ్యామ్ సమీపంలోని ఓ పురుగులమందు కంపెనీ సహా ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారి పి.రమణయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పురుగు మందు, ఎరువులు విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే కాలం చెల్లిన ఎరువులు అమ్మినట్లు తెలిసినా నాసిరకం పురుగుమందు విక్రయించినా ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కె.చంద్రరావు, ఏవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం - సంత నర్సిపురం రోడ్డులో జంగిల్ క్లియరెన్స్


పిచ్చి మొక్కలు తొలగించడంతో విశాలంగా మారిన రహదారి

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం-సంత నర్సిపురం రోడ్డులో పిచ్చి మొక్కలు రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయి ప్రమాదాలకు కేరాఫ్ చిరునామాకు మారాయి. ఈ విషయమై గత నెల 20న సాక్షితో జంగిల్ క్లియరెన్స్ చేయాలి శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు తాజాగా స్పందించారు. ఈ మార్గంలో చలివేంద్రి నుంచి మహదేవివలస వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.

కూటమి నేతల మాటలు నమ్మి మోసపోయాం..

- అరకు ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే కళావతికి సమస్యలు విన్నవించిన మహిళలు


ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే కళావతి వద్ద తమ సమస్యలు చెబుతున్న చిదిమి గ్రామ మహిళలు

వీరఘట్టం: చంద్రబాబును నమ్మి ఓటేసినందుకు తాము మోసపోయామని చిదిమి గ్రామానికి చెందిన పలువురు మహిళలు అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి వద్ద తమ సమస్యలను విన్నవించుకున్నారు. వీరఘట్టం మండలం చిదిమి గ్రామానికి మంగళవారం వచ్చిన ఎంపీ తనూజారాణితో మహిళలు మాట్లాడారు. తల్లికి వందనం అని చెప్పి అర్హులైన చాలా మందికి ఈ పథకాన్ని ఇవ్వలేదని, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఫ్రీ అని చెప్పారని, ఇంత వరకు మొదటి గ్యాస్ సిలెండర్ డబ్బులే పడలేదన్నారు. ఇలా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలందరినీ మోసగించిందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రానున్నది జగనన్న ప్రభుత్వమే.. అప్పుడు మీ అందరి కష్టాలు తీరిపోతాయని హామీ ఇచ్చారు. ఏడాది కూటమి పాలనలో గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులు మీ ఇంటికి వస్తే వారిని సూపర్ సిక్స్‌పై నిలదీయాలన్నారు. ఆమెతో పాటు పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఉన్నారు. అంతకు ముందు ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే కళావతి గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. వీరికి ఆలయ ధర్మకర్త, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సాదర స్వాగతం పలికారు. స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ


పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున రోగులకు అందుబాటులో సిబ్బంది ఉండాలని, అవసరమైన మందులు ఆస్పత్రిలో ఉండేలా చూసుకోవాలన్నారు. రోగంతో వచ్చే ప్రతి రోగి ఆరోగ్యం బాగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అక్కడి నుంచి అదే గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన ఆయన పారిశుధ్య నిర్వహణను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి అందివ్వడంతో పరిశుభ్రమైన వాతావరణం కూడా అందివ్వాలని తెలిపారు. ఆ తర్వాత దండుసూర గ్రామాన్ని సందర్శించిన ఆయన.. పీఎం జన్‌మన్ గృహాల ప్రగతిని తనిఖీ చేసి, ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నేలకూలిన భారీ వృక్షం


తాటిశీల సమీపంలో రోడ్డుపై పడిన చింత చెట్టు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాటిశీల గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఓ భారీ వృక్షం నేలకూలింది. మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టు రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆ దారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఓ గంట కాలం పాటు శ్రమించి, చెట్టును ముక్కలుగా నరికి రోడ్డు పక్కన పడేశారు. ట్రాఫిక్ అంతరాయం తొలగడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ట్రిపుల్ ఐటీకి మోడల్ స్కూల్ విద్యార్థి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్.సుష్మిత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు సదరు విద్యార్థికి శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల దగ్గరి ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


సుష్మితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది